సాక్షి విశాఖపట్నం

సోమవారం । 1 । జనవరి । 2024

ప్రగతి బాటలో సాగుదాం..



మహారాణిపేట: 2024 నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని కలెక్టర్ మల్లికార్జున ఆకాంక్షించారు. అనుకున్న లక్ష్యాలు నెరవేరాలని, విజయాలు సాధించాలని కోరుతూ ఓ ప్రకటన విడుదల చేశారు. 2023 సంవత్సరంలో ప్రభుత్వ లక్ష్యాలు నెరవేర్చడంలో యంత్రాంగం అద్భుతంగా పనిచేసిందని, 2024లో కూడా అదే రీతిన ఉత్తమ సేవలు అందించాలని పిలుపునిచ్చారు.

అభివృద్ధిలో భాగస్వాములవుదాం





డాబాగార్డెన్స్: విశాఖ అభివృద్ధి కోసం మరింత శ్రమిద్దాం ..2023లో మంచి ఫలితాలు సాధించాం. అదే స్ఫూర్తితో 2024లో కూడా సమష్టిగా భాగస్వాములవుదాం' అని మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. స్వచ్ఛసర్వేక్షణ్‌లో భాగస్వాములైన నగరవాసులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. అందరికీ మంచి జరగాలని కోరుకుందాం.

న్యూస్‌రీల్

ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల జిల్లా సంఘ కార్యవర్గం



ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం నూతన కార్యవర్గం

మద్దిలపాలెం: ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్ల జిల్లా సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం డాక్టర్.వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జరిగింది. కార్యవర్గం నూతన అధ్యక్షుడిగా ఆర్.పి. నాయుడు, కార్యదర్శిగా బి.సూరిబాబు, సహాయ కార్యదర్శిగా కె.సూరిబాబు, మహిళా కార్యదర్శిగా కె.కళావతమ్మ, కోశాధికారిగా పి.హేమంత్‌కుమార్, స్టేట్ కౌన్సిలర్‌గా బి.సింహాద్రినాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ పి.వి.ఎస్.మూర్తి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

2న డయల్ యువర్ సీపీ

విశాఖ సిటీ: నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది బందోబస్తులో ఉండడంతో సోమవారం జరగాల్సిన డయల్ యువర్ సీపీ కార్యక్రమాన్ని 2వ తేదీ మంగళవారం నిర్వహిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. యథావిధిగా జనరి 1, 15 తేదీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఈ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. మంగళవారం జరిగే ఈ కార్యక్రమానికి ప్రజలు 0891–2523408 నంబర్‌కు కాల్ చేసి వారి సమస్యలు, ఫిర్యాదులను తెలియజేయాలని సూచించారు.

నేటి స్పందన రద్దు

మహారాణిపేట: సోమవారం ఉద్యోగులకు ఐచ్ఛిక సెలవు నేపథ్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున తెలిపారు. ఐచ్ఛిక సెలవు కారణంగా పలు శాఖల అధికారులు, ఉద్యోగులు అందుబాటులో ఉండరని, అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

జీవీఎంసీలో కూడా...

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం నిర్వహించాల్సిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం రద్దు చేసినట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ప్రకటనలో పేర్కొన్నారు.సోమవారం ఐచ్ఛిక సెలవు కావడంతో అధికారులు, ఉద్యోగులు అందుబాటులో ఉండనందున ఈ కార్యక్రమం రద్దు చేసినట్టు తెలిపారు.

మార్షల్ ఆర్ట్స్‌లో విశాఖ వాసుల సత్తా



శివరామకృష్ణను సత్కరిస్తున్న ప్రొఫసర్ సుభాకర్‌రాజు

మురళీనగర్: ఇటీవల పాండిచ్చేరిలో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే టోర్నమెంట్‌లో విశాఖ క్రీడాకారులు తమ సత్తా చాటారు. విశాఖ పీఎస్ఆర్ మార్షల్ ఆర్ట్స్‌నుంచి 19 విద్యార్థులు పాల్గొనగా వీరిలో 11మంది బంగారు, రజిత, కాంస్య పతకాలు సాధించారు. ఈ సంస్థ నుంచి పాల్గొన్న పోర్ట్ ట్రస్టు ఉద్యోగుల్లో జి.శివరామకృష్ణ ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించారు. ఈ సందర్భంగా ఆయనను కేఎల్ యూనివర్సిటీ డీన్ ప్రొఫసర్ ఆర్.సుభాకర్ రాజు చేతులు మీదుగా ఆదివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీఎస్ఆర్ మార్షల్ ఆర్ట్స్ గౌరవాధ్యక్షుడు ఎస్వీ రమణ, మార్షల్ ఆర్ట్స్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ పి.నరసింహారావు, కోచ్ పరదేశి పాల్గొన్నారు.

మరో 9 మందికి కరోనా



మహారాణిపేట: విశాఖలో ఆదివారం మరో 9 మందికి కరోనా సోకింది. గడిచిన 24 గంటల్లో 140 మందికి పరీక్షలు చేయగా, వీరిలో 9 మందికి కరోనా నిర్ధారణ అయింది. 12 మంది హోమ్ ఐసోలేషన్‌లోను, ఐదుగురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా.. 11 మంది డిశ్చార్జ్ అయ్యారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఇప్పటి వరకు 28 మందికి కరోనా పాజిటివ్ వచ్చింది.

న్యూ ఇయర్ జోష్



బీచ్‌లో యువతుల సందడి



గాదిరాజు ప్యాలెస్‌లో...

నిన్నటిదాకా మన వెంట వచ్చిన నేస్తం ఇక సెలవంటూ తెరచాటుకు తప్పుకుంది. ఏడాదంతా చేయి పట్టుకు నడిచిన చెలి వీడ్కోలు చెబుతూ కాలం పరదాల మాటున మాయమైంది. ఎన్నో అనుభూతులను, అనుభవాలను పంచి ఇచ్చిన మరో సంవత్సరం బతుకు ప్లాట్‌ఫాంపైనుంచి తరలి వెళ్లింది. నెలలు రోజులై, రోజులు గంటలై, గంటలు నిమిషాలు.. క్షణాలై.. ఓ ఏడాది మన గుప్పెట్లోనుంచి జారి అదృశ్యమై అంతర్థానమైంది. అనంత కాల ప్రవాహంలో పూల పడవలా తరలివెళ్లింది. అయితేనేం.. కాలం జీవనది. అది ఎక్కడా ఆగనిది. అందుకే ఆ రైలు అలా వెళ్లిందో లేదో.. ఈ పడవ అలా మళ్లిందో లేదో.. మరింత అందంగా.. మరింత నవ్యంగా.. ఇంకాస్త వయ్యారంగా.. కొత్త సంవత్సరం రానే వచ్చింది. కోటి ఆశలతో విశాఖ ప్రజలు స్వాగతం పలికారు. 2023కు వీడ్కోలు పలికి, కొత్త సంవత్సరంలో అన్నీ శుభాలే జరగాలని ఆశిస్తూ '2024'ను సాదరంగా ఆహ్వానించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి మొదలుకుని సోమవారం తెల్లవారుజాము వరకు జిల్లా అంతటా ఎటుచూసినా న్యూ ఇయర్ సంబరాలు కొనసాగాయి. యువత హడావుడికి అంతే లేకుండాపోయింది. కొత్త సంవత్సరం వేడుకలకు ముందుగానే ఏర్పాట్లు పూర్తి చేసుకున్న యువతీ, యువకులు సరిగ్గా రాత్రి 12 గంటలు కాగానే రోడ్లపైకి చేరుకుని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. యువకులు బృందాలుగా ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ సందడి చేశారు. యువతీ, యువకులు ఎవరికి వారు తమ స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యులను ఆహ్వానించి ఎంతో ఉత్సాహంగా సంబరాల్లో మునిగితేలారు.నగరంలోని ప్రముఖ హోటళ్లు కొత్త సంవత్సరం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశాయి. స్వీట్‌షాపులు, బేకరీలు, పూల బొకేల దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడాయి.

– సాక్షి, విశాఖపట్నం

'అమృత్ భారత్'.. వచ్చేసింది

- వాల్తేరు డివిజన్‌లోకి స్వాగతం పలికిన స్పీకర్ తమ్మినేని
- ఆధునిక వసతులతో ఆకట్టుకున్న సామాన్యుల ఎక్స్‌ప్రెస్



రైలుకు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు



రైలు వద్ద విద్యార్థుల కేరింతలు

బీచ్ రోడ్డు: సామాన్యుల సూపర్‌ఫాస్ట్ రైలుగా చెప్పుకునే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ వాల్తేరు డివిజన్‌లో పట్టాలపై పరుగులు పెట్టింది. ఆదివారం 12.45 గంటలకు వాల్తేరు డివిజన్ పరిధిలోని శ్రీకాకుళం రోడ్డు జంక్షన్‌కు చేరిన ఈ రైలుకు అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎంపీ రామ్మోహన్ నాయుడు ఘన స్వాగతం పలికారు. భారత్‌లో సూపర్‌ఫాస్ట్ అంటే వందే భారత్ ఎక్స్‌ప్రెస్. అయితే ఈ రైలులో ప్రయాణం చాలా ఖరీదు. దీంతో సామాన్యులు ఈ రైలు ఎక్కేందుకు ఆసక్తి కనబరచడం లేదు. దీనిని దృష్టిలో పెట్టుకుని భారతీయ రైల్వే అదే స్పీడ్.. అదే సౌకర్యాలను సామాన్య ప్రయాణికులకు అందించాలని అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ పేరుతో పట్టాలెక్కించింది. స్పీడ్‌లో గానీ, సౌకర్యాల్లో గానీ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ రైలు ఏ మాత్రం తీసిపోదు. అయితే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఫుల్ ఏసీ బోగీలతో నడిస్తే అమృత్ ఎక్స్‌ప్రెస్ నాన్ ఏసీల బోగీలతో నడుస్తుంది. సులభంగా చెప్పాలంటే అత్యంత స్పీడ్‌తో అత్యాధునిక సౌకర్యాలతో నడిచే పాసింజర్ రైలే ఈ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్. 22 బోగీలతో నడిచే ఈ రైళ్ల(రెండు రైళ్లు)ను ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించడం తెలిసిందే.

సౌకర్యాలు ఇవే..

వందే భారత్ రైలు మాదిరిగానే ఈ రైలు కూడా 130 కిలోమీటర్ల స్పీడ్‌తో నడుస్తుంది. అత్యాధునిక మరుగుదొడ్లు, సీసీ కెమెరాలు, మొబైల్స్ పెట్టుకునేందుకు ప్రత్యేకంగా చార్జింగ్ పాయింట్లు, వాటర్ బాటిళ్ల కోసం ఫోల్డబుల్ బాటిల్ హోల్డర్స్, మెరుగైన లగేజీ రాక్, ఎల్ఈడీ లైట్లు, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం, ఎర్గోనామిక్‌గా డిజైన్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రతి బోగీలో ఒక వెస్ట్రన్‌తో పాటు మూడు ఇండియన్ స్టైల్ టాయిలెట్స్, కాళ్లతో ఆపరేట్ చేసే వాటర్ ట్యాప్‌లు ఉన్నాయి. 1834 మంది పాసింజర్లను తీసుకొని వెళ్లగలిగే ఈ రైలు మొత్తం 22 బోగీలతో నడుస్తుంది. 12 స్లీపర్ క్లాసులు, 2 రిజర్వ్‌డ్ స్లీపర్ క్లాసులు, 8 సాధారణ పాసింజర్ బోగీలు ఉన్నాయి.



రైలులో ప్రయాణికులు

కుదుపుల్లేని ప్రయాణం

అత్యధిక స్పీడ్‌తో నడిచే రైలు కావడంతో కుదుపులు లేకుండా ఉండేందుకు తొలిసారిగా పుష్ అండ్ పుల్ రాక్ విధానంలో బోగీలను రూపొందించారు. దీని వల్ల కుదుపులు లేకుండా రైలు ప్రయాణించడంతో పాటు బోగీలు తప్పిపోకుండా భద్రత కూడా ఉంటుంది. ఈ రైలు 13434 నంబరుతో వారానికి ఒక్క రోజు మాల్దా టౌన్ నుంచి బెంగళూరు ప్రయాణిస్తుంది. మాల్దాటౌన్‌లో ఉదయం 8.50 గంటలకు బయలుదేరి మరోసటి రోజు ఉదయం 3 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. మళ్లీ 13233 నంబరుతో బెంగళూరు నుంచి మధ్యాహ్నం 1.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11 గంటలకు మాల్దా టౌన్ చేరుకుంటుంది. ఈ రైలు మన రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తుని, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్‌లలో ఆగుతుంది.

అడుగడుగునా ఘన స్వాగతం

మాల్దా టౌన్ నుంచి బయలుదేరి ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించిన అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఆగిన ప్రతి స్టేషన్‌లో ఘన స్వాగతం లభించింది. స్కూల్, కాలేజీ విద్యార్థులు కరతాల ధ్వనులతో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తుని రైల్వే స్టేషన్లలో రైలుకు స్వాగతం చెప్పారు.



అధునాతన కోచ్

భద్రత.. సౌకర్యాలు



నాన్ ఏసీ రైలు అయినా సీసీ టీవీలు ఉండడంతో ప్రయాణికులకు ఎంతో భద్రత ఉంటుంది. వందే భారత్ రైలులో ఉండే సౌకర్యాలన్నీ ఈ రైలులో ఉన్నాయి. టాయిలెట్స్ చాలా అధునాతనంగా ఉన్నాయి. బెర్త్‌లు, మొబైల్ చార్జింగ్ పాయింట్స్ ఎంతో సౌకర్యవంతం కానున్నాయి.

– వి.సిరిభువన, ప్రయాణికురాలు, విశాఖపట్నం

సామాన్యులకు వరం..



దూర ప్రయాణాలు చేసే సామాన్యులకు ఈ రైలు ఒక వరం అని చెప్పాలి. అతి తక్కువ ఖర్చుతో వేగంగా తమ గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం ఈ అమృత్ రైలు కలిగిస్తుంది. దీని వల్ల డబ్బుతో పాటు సమయం ఆదా అవుతుంది. సౌకర్యాలు చాలా బాగున్నాయి.

– ఆర్.లక్ష్మి, ప్రయాణికురాలు, అక్కయ్యపాలెం

14న గోదాదేవి కల్యాణం



గోదాదేవి, వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అనుబంధ దేవాలయమైన కొండదిగువ వేంటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 14న భోగి రోజు గోదా కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆదివారం తెలిపారు. ఆరోజు ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణం నిర్వహిస్తామన్నారు. ఆదివారం నుంచి టికెట్లు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ఆన్‌లైన్‌లో టికెట్లు తీసుకునే భక్తులు టీటీటీ. aptemples.ap.gov.in ద్వారా తీసుకోవచ్చని తెలిపారు. అలాగే నేరుగా టికెట్లు తీసుకునే భక్తులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో సంప్రదించాలని కోరారు. టికెట్టు రూ.1000లని తెలిపారు.

ఆన్‌లైన్‌లో స్వాతినక్షత్రం టికెట్లు

సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈనెల 6న స్వాతినక్షత్రం రోజున జరిగే శ్రీనృసింహ హోమంలో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్టు దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు. www. aptemples. ap. gov. in ద్వారా టికెట్లు తీసుకోవచ్చని తెలిపారు. అలాగే నేరుగా వచ్చే భక్తులు సింహగిరిపై ఉన్న పీఆర్ఓ కార్యాలయంలో తీసుకోవచ్చని తెలిపారు.

కనులపండువగా నృత్యోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీఎండీఏ అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు, హరిరామమూర్తి బృందం



నృత్యం చేస్తున్న కళాకారులు

మద్దిలపాలెం: నాట్య సన్నిధాలయ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కళాభారతి ఆడిటోరియంలో నృత్యోత్సవం కనులపండువగా సాగింది. కూచిపూడి నాట్యగురువు సన్నిధా సాగిరాజు శిష్యులు ఆర్కెస్ట్రా సహకారంతో కదురమ్యంగా నృత్యాలను ప్రదర్శించారు. గురు సన్నిధా సాగిరాజ్ నట్టువాంగం,గాత్రం చేయగా, డి.ఎస్.వి.శాస్త్రి మృదంగం, కె.రాజగోపాలాచారి ఫ్లూట్, వి.వి.ఎస్.మురళి వయోలిన్ సహకారంలో నృత్య ప్రదర్శన అద్భుతంగా సాగింది. ముందుగా ఈ కార్యక్రమాన్ని వీఎండీఏ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు, సెయింట్ జోసెఫ్ కాలేజీ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ హోం సైన్స్ వై.లక్ష్మీ ప్రభు, కూచిపూడి కళాక్షేత్రం ప్రిన్సిపాల్ హరిరామమూర్తి, కూచిపూడి నాట్య గురువు పార్వతీ రామచంద్రన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

7న వెంకటాద్రిపై సుదర్శన హోమం



స్వామీజీని ఉత్సవాలకు ఆహ్వానిస్తున్న వెంకటాద్రి బృందం

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం తిరుప్పావై సేవాకాలం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తిరుప్పావై 15వ పాశురాన్ని వివరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి సన్నిధిలో విశేష పూజలు జరిపారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 7న వెంకటాద్రిపై సుదర్శన హోమం నిర్వహించనున్నారు. ఈ మేరకు శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిని వెంకటాద్రి ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో బృందం కలిసి ఈ కార్యక్రమానికి ఆహ్వానించింది. స్వామీజీ ఆశీస్సులు తీసుకుని ఆహ్వానపత్రిక అందజేసింది. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం స్వామి నవనీత(వెన్న) అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

రన్నరప్‌గా ఏయూ టెన్నిస్ జట్టు

విశాఖ స్పోర్ట్స్: సౌత్‌జోన్ అంతర్ వర్సిటీల టెన్నిస్ పోటీల్లో ఏయూ మెన్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. కృష్ణా వర్సిటీ ఆధ్వర్యంలో విజయవాడ లయోలా కళాశాలలో ఈ పోటీలు జరిగాయి. జట్టుకు కోచ్‌గా లక్ష్మణ్ వ్యవహరించారు. ఈ సందర్భంగా జట్టును ఏయూ ఇన్‌చార్జి వీసీ కె.సమత, రిజిస్ట్రార్ జేమ్స్, ఏయూ పీఈ విభాగం సిబ్బంది అభినందించారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

విమ్స్ @ 3039

- 2023లో రికార్డుస్థాయిలో శస్త్రచికిత్సలు
- లక్ష దాటిన ఓపీ సేవలు
- రోగులకు వరంగా మారిన ఆరోగ్య శ్రీ

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) మెరుగైన వైద్య సేవలందిస్తూ.. రోగులపాలిట వరంగా మారింది. అనుభవజ్ఞులైన వైద్య సిబ్బంది, సౌకర్యాలు, ఆధునిక వైద్య పరికరాలు, ఆరోగ్య శ్రీ అందుబాటులో ఉండటంతో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఉభయగోదావరి జిల్లాల నుంచి రోగులు వచ్చి.. ఇక్కడ వైద్య సేవలు పొందుతున్నారు. 2023లో లక్షకు పైగా ఓపీ నమోదు కాగా.. 3 వేలకు పైగా శస్త్ర చికిత్సలు జరగడం విశేషం. విమ్స్ ప్రారంభంలో మందకొడిగా వైద్య సేవలందేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వైద్య ఆరోగ్య రంగంపై ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగా ఇక్కడ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది నియామకం, ఆధునిక సౌకర్యాలు కల్పించడంతో పాటు కొత్త విభాగాలను ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో ఈ నాలుగేళ్లలో ఇక్కడ సేవలు విస్తృతమయ్యాయి. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా ఇక్కడ ఎక్కువ మంది సేవలు పొందుతున్నారు. రాష్ట్ర స్థాయి కోవిడ్ ఆస్పత్రిగా కూడా మొదటి, రెండు దశల్లో విస్తృతమైన సేవలందించింది విమ్స్.

రికార్డు స్థాయిలో శస్త్రచికిత్సలు

విమ్స్‌లో 2023 జనవరి నుంచి డిసెంబర్ నెలాఖరు వరకు 1,14,838 మంది ఓపీ సేవలు వినియోగించుకున్నారు. వీరిలో 6,783 మంది ఇన్‌పేషెంట్లు కాగా.. 4,734 మంది ఆరోగ్య శ్రీ ద్వారా ఇన్‌పేషెంట్ సేవలు పొందారు. ఇన్‌పేషెంట్లలో వివిధ సమస్యలతో బాధపడుతున్న 3,039 మందికి శస్త్ర చికిత్సలు జరిగాయి. వీటిలో 2,961 మందికి ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్సలు జరగడం విశేషం. 2,214 మందికి ఇక్కడ వైద్యులు మేజర్ సర్జరీలు చేశారు. జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్, న్యూరో సర్జరీ, కార్డియాలజీ, ఈఎన్‌టీ, ప్లాస్టిక్ సర్జరీ, తదితర విభాగాల్లో ఈ శస్త్ర చికిత్సలు జరిగాయి. ఇక 2023లో కొత్త విభాగాలు అందుబాటులోకి వచ్చాయి. మెడికల్ అంకాలజీ, సర్జికల్ అంకాలజీ, మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, ఎండోక్రైనాలజీ, ప్లాస్టిక్ సర్జరీతో పాటు స్పైనల్ రిహాబిలిటేషన్ సెంటర్(ఆధునిక పరికరాలతో ఫిజియోథెరపీ)ను అందుబాటులోకి తీసుకొచ్చారు.



సర్జరీలు చేస్తున్న ఆర్థోపెడిక్, గుండె వైద్యులు (ఫైల్)

కీలకమైన శస్త్ర చికిత్సలు చేశాం



విమ్స్‌లో 2023 ఏడాది 3,039 శస్త్ర చికిత్సలు చేశాం. లక్షకు పైగా ఓపీ నమోదైంది. ఆర్థోపెడిక్, గుండె, న్యూరాలజీకి సంబంధించి ఎంతో కీలకమైనవి శస్త్రచికిత్సలు జరిగాయి. ఆర్గాన్ డొనేషన్లకు సంబంధించి బ్రెయిన్‌డెడ్ అయిన ఇద్దరికి శస్త్రచికిత్సలు చేశాం. ఇక్కడ అన్ని విభాగాల్లో స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో ఉన్నారు. ఆధునిక పరికరాలు, సదుపాయలు ఉన్నాయి. స్పైనల్ రిహాబిలిటేషన్ సెంటర్‌కు స్పందన బాగుంది. రోజుకు 60 మందికి పైగా వస్తున్నారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, ఎండోక్రైనాలజీ విభాగాలు కొత్తగా ఏర్పాటు చేశాం. ఇక్కడ వైద్యులు, నర్సింగ్, ఇతర సిబ్బంది అంకితభావంతో సేవలందిస్తున్నారు. 2024లో మరింత మెరుగైన వైద్య సేవలందిస్తాం.

– డాక్టర్ కె.రాంబాబు, విమ్స్ డైరెక్టర్

నూతనోత్సాహం

గోపాలపట్నం: నూతన సంవత్సరం సందర్భంగా విశాఖ విమానాశ్రయం విద్యుత్ వెలుగులతో ధగధగలాడుతోంది. విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ దీపాలను అలంకరించి సుందరంగా తీర్చిదిద్దారు. గ్రీనరీ టాన్‌లో విద్యుత్ దీపాలతో న్యూ ఈయర్ 2024 ఏర్పాటు చేయగా.. పలువురు అక్కడ ఫొటోలు తీసుకున్నారు.



మైనర్‌పై సామూహిక లైంగిక దాడి

- ఫోర్తు టౌన్ పోలీస్ స్టేషన్‌లో డిసెంబర్ 18న మిస్సింగ్ కేసు నమోదు
- పది మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

సీతమ్మధార : నగరంలో దారుణం చోటుచేసుకుంది. మైనర్ (17)పై లైంగిక దాడి ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తమ కుమార్తె కనిపించడం లేదంటూ తల్లిదండ్రులు ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివీ. ఒడిశా రాష్ట్రం కలహండి జిల్లాకు చెందిన బాలిక తండ్రి సురేష్ బేషిరా కటుంబంతో సహా విశాఖలో నివసిస్తున్నారు. తన కుమార్తె కనిపించడం లేదని డిసెంబర్ 17న పోలీసులకు ఫిర్యాదు చేయగా... 18న కేసు నమోదు చేశారు. ఫణీంద్ర గ్రామంలో బాలిక ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అక్కడి నుంచి బాలికను విశాఖ తీసుకొచ్చారు. ఏం జరిగిందని ఎంత అడిగినా బాలిక చెప్పలేదు. చివరకు ఆదివారం ఉదయం నోరు విప్పి జరిగింది చెప్పింది. 17న రాత్రి రెండు లాడ్జీలలో పది మంది తనపై లైంగికదాడికి పాల్పడ్డారని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు షాక్‌కు గురయ్యారు. వెంటనే ఆదివారం ఉదయం జరిగిన విషయాన్ని పోలీసులకు చెప్పగా... కేసు నమోదు చేసి పది మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని నగర పోలీసు కమిషనర్ రవిశంకర్ తెలిపారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బీఎస్ కృష్ణ



బీఎస్ కృష్ణ

గోపాలపట్నం: విశాఖ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బీఎస్ కృష్ణ(ఆల్ఫా కృష్ణ) మూడో సారి నియమితులయ్యారు. ఈ మేరకు అగ్రికల్చర్, కార్పొరేషన్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. వైస్ చైర్మన్‌గా పిరింట్ల యువతరెడ్డి, సభ్యులుగా కె.సుమిత్ర, టి.మరణమ్మ, షయిక్ ఆలీమీ, బి.నాగమణి, ఈ.హేమ, టి.ప్రసూన, బి.సన్యాసిరావు, ఐ.రవికుమార్, సీహెచ్ వరలక్ష్మి, జి.వెంకటసత్యానారాయణ రాజు, ఎస్.వెంకటసుబ్బరాజు, పి.శ్రీనివాసరావు, కొత్తపాలెం పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజు, జిల్లా వ్యవసాయ మార్కెట్ ట్రేడ్ అధికారి, విశాఖ వ్యవసాయ అసిస్టెంట్ డైరెక్టర్, జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి సభ్యులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ వినియోగదారులు, రైతులకు మౌలిక వసతులు కల్పించే విధంగా చర్యలు చేపడతామన్నారు.

బీచ్ రెజ్లింగ్ చాంపియన్ హర్యానా

- ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఢిల్లీ, ఏపీ



హర్యానా బృందానికి ట్రోఫీ అందిస్తున్న దినేష్

బీచ్‌రోడ్డు: ఆర్.కె.బీచ్‌లో జరిగిన జాతీయస్థాయి బీచ్ రెజ్లింగ్ పోటీల్లో హర్యానా చాంపియన్‌గా నిలిచింది. మూడు రోజుల పాటు సాగిన ఈ పోటీల్లో క్రీడాకారులు నువ్వా నేనా అన్నట్లు తలపడ్డారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో బాలురు, బాలికలకు బరువుల వారీగా 370 మ్యాచ్‌లు నిర్వహించారు. అన్ని విభాగాల్లో హర్యానా క్రీడాకారులు సత్తా చాటి విజేతగా నిలిచారు. ద్వితీయ స్థానంలో ఢిల్లీ, తృతీయ స్థానంలో ఏపీ క్రీడాకారులు నిలిచారు. ఈ సందర్భంగా ఇండియన్ బీచ్ గ్రాప్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు దినేష్ మా ట్లాడు తూ భవిష్యత్‌లో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీలు విశాఖలో నిర్వహించేందుకు తమకు మంచి ప్రోత్సాహం లభించిందన్నారు. అసోసియేషన్ కార్యదర్శి శర్మ, రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు డి.సాయిరామ్‌తో కలిసి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేవీఆర్, వేడుకల్లో పాల్గొన్న హాస్యనటులు

ఆనందోత్సాహాలతో కొత్త వత్సర వేడుకలు

కొమ్మాది: భీమిలి బీచ్‌రోడ్డు తిమ్మాపురంలోని వైజాగ్ ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌లో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా వేడుకలను కల్చరల్ సెంటర్ అధ్యక్షుడు కాయల వెంకటరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కల్చరల్ సెంటర్.. ఉత్తరాంధ్రలోనే ఉత్తమమైన కల్చరల్ సెంటర్‌గా పేరొందిందని చెప్పారు. సభ్యుల కోసం ఏటా ఉగాది, దసరా, కొత్త సంవత్సర వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేడుకల్లో భాగంగా హాస్యనటులు అప్పారావు, గడ్డం నవీన్, సత్తి పండు, వినోదిని, కోకిల వినోదాన్ని పండించగా.. పల్సర్ బైక్ ఝాన్సీ డ్యాన్స్‌లతో ఉర్రూతలూగించింది. సెంటర్ డైరెక్టర్ ఎం.ఎ స్.ఎన్. రాజు తదితరులు పాల్గొన్నారు.